తరలనున్న రైతుబజార్..!

ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి తొలగింపునకు నిర్ణయం

- ఏసీపీ కార్యాలయం వెనుక సమీకృత మార్కెట్‌లో విలీనం
- విముఖత వ్యక్తం చేస్తున్న పలువురు రైతులు



ఇల్లెందు క్రాస్ రోడ్డులోని రైతు బజార్



అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ఇల్లెందు క్రాస్ రోడ్డులో కొనసాగుతున్న రైతుబజార్‌ను నగరంలోని వీడీవోస్ కాలనీ ఏసీపీ కార్యాలయం వెనుక (రామాలయం పక్కన) నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌లోకి తరలించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రైతుబజార్‌లో కొనసాగుతున్న వ్యాపారులు సమీకృత మార్కెట్‌కు వెళ్లాల్సి ఉంటుందని అధికారులు ఇప్పటికే సమాచారం ఇవ్వడమే కాక ప్రజలకు అవగాహన కోసం పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఖమ్మం కార్పొరేషన్ ఆధ్వర్యాన ఇల్లెందు రోడ్డు నుంచి గట్టయ్య సెంటర్‌కు వెళ్లే మార్గంలో ఏసీపీ కార్యాలయం వెనుక సమీకృత మాంసాహార, శాఖాహార మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్) నిర్మించారు. ఈ మార్కెట్‌లోని వెజిటబుల్(శాఖాహార) విభాగాన్ని రైతుబజార్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. ఇదే సమయంలో ఇల్లెందు క్రాస్ రోడ్డులో నిర్వహిస్తున్న రైతుబజార్ ఇరుకుగా ఉండటం, రహదారి వెంట కొందరు వ్యాపారులు విక్రయిస్తుండటంతో వాహన రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. ఈ నేపథ్యాన రైతుబజార్‌ను నూతనంగా నిర్మించిన వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోకి తరలించాలనే నిర్ణయానికి వచ్చారు.

రైతుల నుంచి మిశ్రమ స్పందన

ఇల్లెందు క్రాస్ రోడ్డులోని రైతుబజార్‌ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోకి తరలించాలనే నిర్ణయంపై పలువురు రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం మున్సిపాలిటీగా ఉన్న సమయాన భక్త రామదాసు కళాక్షేత్రం పక్కన రైతుబజార్‌ను ఏర్పాటు చేయగా.. 2014లో ఇల్లెందు క్రాస్ రోడ్డులో రైతుబజార్ ఏర్పాటైంది. ఇక ఖమ్మం కార్పొరేషన్‌గా అవతరించాక పలుచోట్ల సమీకృత మార్కెట్లు నిర్మిస్తూ దశల వారీగా రైతుబజార్లను ఎత్తేస్తున్నారు. ఇందులో భాగంగా బైపాస్ రోడ్డు నూతన బస్టాండ్ పక్కన సమీకృత మార్కెట్ నిర్మించి భక్త రామదాసు కళాక్షేత్రం పక్కన ఉన్న రైతుబజార్‌ను అక్కడకు తరలించారు. అప్పట్లో రైతులు ఆందోళన చేయగా.. సమీకృత మార్కెట్‌లో ఆశించిన ఫలితాలు లేక పలువురు రైతులు విక్రయాలను విరమించుకున్నారు. ఇక ఇల్లెందు క్రాస్ రోడ్డులోని రైతుబజార్‌లో ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి, కొణిజర్ల, చింతకాని, ఖమ్మం రూరల్, కూసుమంచి తదితర మండలాలకు చెందిన 60 మంది రైతులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు విక్రయిస్తున్నారు. మరో 20 మంది స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు కూరగాయలు, పాలు, గుడ్లు, ఉల్లిగడ్డలు, ఇతర ఆహార పదార్థాలు అమ్ముతున్నారు. ఇప్పుడు ఈ రైతుబజార్‌ను కూడా సమీకృత మార్కెట్‌లోకి తరలించానే నిర్ణయంపై మిశ్రమ స్పందన వస్తోంది.

ప్రభుత్వం పునరాలోచించాలి



రైతుబజార్‌ను సమీకృత మార్కెట్‌లోకి తరలించాలనే అంశంపై పునరాలోచించాలి. గతంలో భక్తరామదాసు కళాక్షేత్రం వద్ద ఉన్న రైతుబజార్‌ను కొత్త బస్టాండ్ వద్ద సమీకృత మార్కెట్‌లో విలీనం చేస్తే నష్టమే జరిగింది. అదే పరిస్థితి ఇల్లెందు క్రాస్ రైతుబజార్‌కు పట్టకుండా చూడాలి.

– భద్రకాళి, బాలపేట, రఘునాథపాలెం మండలం

రైతుబజార్‌ను తరలించొద్దు



ఇల్లెందు క్రాస్‌లోని రైతు బజార్‌లో తొమ్మిదేళ్లుగా కూరగాయలు విక్రయిస్తున్నాం. ఈ రైతు బజార్ ఆధారంగానే మా జీవనం సాగుతోంది. ఇప్పుడు ఒకేసారి మార్కెట్‌లోకి వెళ్లాలని చెప్పడం సరికాదు. ప్రస్తుతం ఉన్న స్థానంలోనే రైతుబజార్‌ను కొనసాగిస్తే మాకు మేలు జరుగుతుంది.

– బానోత్ ధర్మా, సూర్యతండా, రఘునాథపాలెం

త్వరలో తరలింపు



నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న రైతుబజార్‌ను వీడీవోస్ కాలనీ ఏసీపీ కార్యాలయం వెనుక రామాలయం పక్కన నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోకి తరలించనున్నాం. ఇక్కడ విక్రయాలు చేపడుతున్న వారితో పాటు ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలు కూడా ఏర్పాటుచేశాం.

– కె.నాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ఆదాయం రాబట్టేలా మేళా..

- ట్రేడ్ లైసెన్స్‌ల జారీకి మరోసారి ప్రత్యేక డ్రైవ్
- ఇన్‌చార్జ్‌లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నియామకం
- దిశా నిర్దేశం చేసిన ఏఎంసీ మల్లీశ్వరి



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న మల్లీశ్వరి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్‌లైసెన్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే నగరంలోని కమాన్‌బజార్, కస్బాబజార్, గాంధీచౌక్‌ల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా.. ఇతర ప్రాంతాల్లోనూ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇంటి పన్నుల వసూలు, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ కొనసాగుతుండగా.. అదనంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తూ కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31వ తేదీలోగా నగరంలో 7,200 ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసేలా లక్ష్యాలను నిర్దేశించారు.

రోజు వారీ లక్ష్యాలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఏర్పాటు చేసిన బృందాలు రోజుకు 8 నుండి 32 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉంటుంది. అలాగే, వారు నిర్దేశిత ప్రాంతాలను కేటాయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరించే బృందంలో కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు మరో జవాన్ ఉంటారు. ఈ సందర్భంగా బృందాలతో కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి గురువారం సమావేశమై సూచనలు చేశారు. ప్రతీ వ్యాపార సముదాయానికి వెళ్లి లైసెన్స్ ఉందా, లేదా అని పరిశీలించి అక్కడికక్కడే జారీ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు ఈ మేళాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్వో జి.శ్రీనివాసరావు, ఆర్ఐలు పి.లోకేష్, కె.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బృందాలు ఇవే..

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శంకర్‌కు ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల నుండి శ్రీశ్రీ సర్కిల్ బైపాస్ రోడ్డు, గోల్లగూడెం, మమత రోడ్, కవిరాజ్ నగర్ ప్రాంతాలు కేటాయించారు. ఈ బృందం రోజుకు ఎనిమిది చొప్పున మొత్తం 500 ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉంటుంది.
- ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబు నేతృత్వంలోని బృందం వీడీవోస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, ద్వారకనగర్, రస్తోగినగర్, ప్రశాంతినగర్, బాలాజీ నగర్, బల్లేపల్లి, పాండురంగాపురం, జయనగర్ కాలనీల్లో పరిశీలించి రోజుకు 14 చొప్పున మొత్తం 800 లైసెన్స్‌లు జారీ చేయాలని నిర్దేశించారు.
- ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.లాల్యా నేతృత్వంలోని బృందం కాల్వొడ్డు, పీఎస్ఆర్ రోడ్డు, గాంధీచౌక్, రాపర్తినగర్ బోర్డు ప్రాంతాల్లో రోజుకు 30 చొప్పున మొత్తం 1,800 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉంటుంది.
- ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన నియమించిన బృందం మయూరిసెంటర్ నుండి రాపర్తినగర్ బోర్డు, మయూరిసెంటర్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు, ఆర్టీఓ ఆఫీస్ నుండి రాపర్తినగర్ బోర్డు వరకు రోజుకు 35 చొప్పున 2 వేల లైసెన్స్‌లు జారీ చేయాలని సూచించారు.
- ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రమేష్ ముస్తఫానగర్, చెరువుబజార్, పాకబండబజార్, మమత రోడ్డు, అల్లీపురం రోడ్డు, బోనకల్ రోడ్డు ప్రాంతాల్లో రోజుకు ఐదు చొప్పున మొత్తం 300 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉంటుంది.
- ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.మల్లేశ్ ఆధ్వర్యాన కమాన్‌బజార్, కస్బాబజార్, ప్రకాశ్‌నగర్ మెయిన్ రోడ్డు, జెడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు రోజుకు 32 చొప్పున మొత్తం 1,800 లైసెన్స్‌లు జారీ చేయాలని లక్ష్యం నిర్దేశించారు.

క్లుప్తంగా

రైతుబంధు సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర రైతుబంధు సమితి క్యాలెండర్ గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జిల్లా రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, సహాయ వ్యవసాయ సంచాలకులు బి.సరిత, శ్రీనివాస్ రెడ్డి, సతీష్, సాంకేతిక వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: నగరంలోని పలుడివిజన్లలో, రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాల్లో సీఎల్పీనేత భట్టివిక్రమార్క సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కార్పొరేటర్లు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావేద్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు మలిదు వెంకటేశ్వర్లు, లాకవత్ సైదులు, నియోజక వర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రవికుమార్, బాలాజీ, సుబ్బారెడ్డి, వేపకుంట్ల మాజీ సర్పంచ్ రేమల్లే రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

పనిభద్రత కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పెరుగుతున్నాయని, హమాలీలకు పని భద్రత లేకుండాపోతోందని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన హమాలీ మిల్లు వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీల సమస్యలపై ఈ నెల 9న హైదరాబాద్ లేబర్ కమిషన్ కార్యాలయం ఎదుట ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కంకణాల శ్రీనివాస్, జలగం రాంబాబు, బొమ్మకంటి రమేష్, శ్రీనివాస్, శోభన్, రాంబాబు, తిరుపయ్య, శ్రీను, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

రఘునాథపాలెం: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక తెలిపారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా గురువారం మంచుకొండ ఉన్నత పాఠశాల, హర్యాతండా ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. అలాగే, మంచుకొండలో కంటివెలుగు శిబిరం, హర్యాతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు వాంకుడోత్ విజయ, మాలోత్ క్రాంతితో పాటు భుక్యా లక్ష్మణ్‌నాయక్, దేశ్యా, స్వర్ణలత పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రమ్య

నేలకొండపల్లి: విద్యార్థులు తమ లక్ష్య సాధనకు ఇష్టపడి చదవాలని ఎంపీపీ వజ్జా రమ్య సూచించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆదేశాల మేరకు, బీమ్ రావు రామ్‌జీ యూత్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యూత్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్రం అధికారి భానుచందర్, కోనాయిగూడెం సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, గురుకుల వైస్ ప్రిన్సిపాల్ ప్రమీలా, యూత్ లీడర్ వుల్లోజి శ్రీకాంత్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	మైకేల్
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం

- ఖమ్మం గాంధీచౌక్

‘ఉపాధిహామీ’ రద్దు చేసేందుకు కుట్ర



ఖమ్మంరూరల్: నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంరూరల్: ఉపాధిహామీ పనులను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే బడ్జెట్‌లో నిధులు తగ్గించారని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సంగయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు వి.నాగేశ్వరరావు, సుదర్శన్ రెడ్డి, రాంబాబు, వీరబాబు, నాగయ్య, రామకృష్ణ, ఎస్. కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ కార్మికులు, రైతులకు అన్యాయం చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.వెంకటేశ్వరరావు, ఎం.రమేష్ పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, టి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన రైతులకు, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని, నిరుద్యోగులను పట్టించుకోలేదన్నారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, తుల్లూరి నాగేశ్వరరావు, బాలు, రాంబాబు, బింగి రమేష్, రాములు, ముత్తయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ముగిసిన టాస్క్ శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న టాస్క్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల చైర్మన్ జి.కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్‌చందర్, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో భవన నిర్మాణాలను ఇష్టానుసారంగా చేపడుతున్నారని, రోడ్లు, డ్రెయినేజీలను ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లేశ్వరికి గురువారం సీపీఎం టూటౌన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ... బస్టాండ్ ఎదురుగా బైపాస్ రోడ్ డీసీసీబీ బ్యాంకు పక్కనే భారీ బహుళ అంతస్తుల భవనం కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా కట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నర్రా రమేష్, ఎండి.గౌస్, నాగేశ్వరరావు, వెంకన్నబాబు, హుస్సేన్, నాగరాజు, సూర్యం, భద్రం, కాంపాటి వెంకన్న, పి.వాసు పాల్గొన్నారు.

రేపు హద్దురాళ్లు ఏర్పాటు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం నూతన కలెక్టరేట్ సమీపాన బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు ఏర్పాటుచేసిన ప్రాంగణానికి తొలగించిన ప్లాట్ల హద్దురాళ్లను శనివారం ఏర్పాటు చేయడం జరుగుతుందని సుడా చైర్మన్ బచ్చు విజయ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమీపంలోని ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రెవెన్యూ సర్వే అధికారుల పర్యవేక్షణలో తొలిగింపునకు ముందుగా గుర్తించిన హద్దులు ప్రకారం వారి సూచనల మేరకు ఏర్పాటు చేస్తామన్నారు. యజమానులు తమ ప్లాట్ల మ్యాపులను తీసుకురావాలని సూచించారు. ఏఎంసీ డైరెక్టర్ కుతుంబాక నరేష్, నాయకులు తొలపనూరి దానయ్య, మాలోత్ రమేష్, వెలగపూడి వెంకటకృష్ణ, కొర్లపాటి వీరయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు, బీరోలు, పాతర్లపాడు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైస్ షర్మిల ఆదేశాల మేరకు పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి రూ.25వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి రావుల జగన్నాథరెడ్డి, కొత్త బాలాజీరావు మండల అధ్యక్ష, కార్యదర్శులు వాలూరి సత్యనారాయణ, అన్నబత్తుల కృష్ణ పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టగా బీటెక్ విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తల్లంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న కట్టమూడి సుశాంత్ స్నేహితుడితో కలిసి గురువారం ద్విచక్ర వాహనంపై కాలేజీకి వెళ్తున్నాడు. మార్గమధ్యలో వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో సుశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, ఖమ్మంలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు, నాయకులు

కూసుమంచి: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని విన్నవించారు. ఈసందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పిన్నింటి రమ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు మాట్లాడారు. ఆశా వర్కర్‌లకు కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీను, వీరన్న, జ్యోతి, సుభద్ర, ఉమాదేవి, లీలావతి, ఉపేంద్ర, నాగేంద్ర, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ‘పల్లె వెలుగు’ సర్వీసులు



ఇల్లెందు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పాత బస్టాండ్ నుండి ఆర్టీసీ పల్లెవెలుగు సర్వీసులు మరిన్ని కేటాయించారు. బుధవారం ఇల్లెందు, బోనకల్ మార్గాల్లో నాలుగేసి సర్వీసులు, సిటీ సర్వీసులు 15 మాత్రమే నడిచాయి. అయితే, గురువారం ఇల్లెందు మార్గంలో ఆరు, బోనకల్‌కు 11బస్సులతో పాటు సిటీ సర్వీసులు 32 ట్రిప్పులు తిప్పారు. గతంలో మెయిన్ గేటు ద్వారానే సిటీ బస్సులు నడవగా, ఇప్పుడు పాత బస్‌స్టాండ్ వెనుక గోడ కూల్చివేయడంతో బస్సుల రాకపోకలు సులభమయ్యాయి. కాగా, పల్లె వెలుగులు నడుస్తున్నాయని తెలియటంతో ప్రయాణికులు ఇక్కడకు రాగా వారికి నిరాశే మిగిలింది. కోదాడ, సూర్యాపేట సర్వీసులు లేకపోవడం, కేవలం ఇల్లెందు, బోనకల్ బస్సులే ఉండడంతో ఉసూరుమంటూ మళ్లీ కొత్త బస్టాండ్‌కు వెళ్లాల్సి వచ్చిందని సురేష్, వెంకట్రావమ్మ తదితరులు వాపోయారు.

ఉమ్రా చేయడం సువర్ణావకాశం



మాట్లాడుతున్న ముఫ్తీ మజహర్

ఖమ్మంమామిళ్లగూడెం: జీవితంలో ఉమ్రా చేయడం ఒక సువర్ణ అవకాశంలాంటిదని ముఫ్తీ మజహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక దారుల్ ఉల్ మ్ ఇస్లామియా కాల్వొడ్డు మదర్సా లో హాఫిజ్ జవ్వాద్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తొలిసారిగా ఉమ్రా చేసే పురుషులు, మహిళలు ఎలాంటి జాగ్రత్తలు వహించాలి, ఎలాంటి నిబంధనలను అనుసరించాలి అనే విషయంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం నగరంలో గల తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా అత్యధిక మంది, ఒకేసారి 40 మంది ఉమ్రా చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా కుట్లు లేని దుస్తులను, ప్రయాణం కోసం సిద్ధం చేసిన బ్యాగులను తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ యాజమాన్యం పంపిణీ చేసింది.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నేలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయంలో రావెళ్ల సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీడీ చార్జీలు వెంటనే తొలగించేలా ప్రభుత్వంపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, మారుతి కొండలరావు, మందడపు మురళీ, బండి రామమూర్తి, వి.భాస్కర్‌రావు, శేషుబాబు, సామాల మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

‘పెద్దగట్టు’కు తరలిరావాలి

ఖమ్మం మామిళ్లగూడెం: సూర్యాపేటలో ఈనెల 5 నుంచి 9 వరకు జరిగే లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు యాదవులు భారీ ఎత్తున తరలిరావాలని తెలంగాణ యాదవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల ఉపేందర్ యాదవ్ కోరారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జాతరకు తాగునీరు, విద్యుత్, వైద్య సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు పరిటాల లింగరాజు, మల్లేశ్, నియోజక వర్గ ఇన్‌చార్జ్ బడంచర్ల రామయ్య, చింతల నర్సింహారావు పాల్గొన్నారు.

న్యాయవాది వెంకయ్య మృతికి సంతాపం



వెంకయ్య (ఫైల్)

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది పంబా వెంకయ్య గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు వెల్లడించారు. 2006లో న్యాయవాద వృత్తి ప్రారంభించిన ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, వెంకయ్య మృతిపై బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి రామారావు, తులసి వెంకటేశ్వర్లుతోపాటు బిచ్చాల తిరుమలరావు, కర్లపూడి శ్రీనివాస్, ఎక్కిరాల రాంబాబు, లక్ష్మీనారాయణ, దానయ్య, హేమంత్, శేఖర్, స్వామి, శ్రీలక్ష్మి, గిరిజ, కల్యాణి, అనిల్ తదితరులు సంతాపం ప్రకటించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

ఖమ్మంరూరల్: మోతాదుకు మించి పంటలకు ఎరువులు వాడొద్దని ఏఓ వి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని ఆరేకోడు, కాచిరాజుగూడెంలలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ... నిల్వ ఉన్న భాస్వరాన్ని పీఎస్‌బీ విధానంతో కరిగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఏలూరి. భాస్కర్‌రావు, ఎం. వెంకటేశ్వర్లు, ఎండీ సజ్మా కౌసర్, రామకృష్ణ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

‘భగీరథ’ నీరు వృథా..!



నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌లో గల డబుల్ బెడ్‌రూం సముదాయం వద్ద మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ పగిలిపోయి గత కొంతకాలంగా రోడ్లపై నీరు పారుతోంది. అంతేకాకతాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో అందక ఇబ్బంది పడాల్సివస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేయించి నీటి అవసరాలను తీర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఖమ్మంఅర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : హుస్సేన్,
మిషన్ భగీరథ ఏఈ కార్పొరేషన్
సెల్ నంబర్ : 9000393118